క్లుప్తంగా

ఆరిలోవ పీఎస్‌కు ఎట్టకేలకు కొత్త సీఐ



విధుల్లో సీఐ మల్లేశ్వరరావు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు కొత్త సీఐ వచ్చారు. సుమారు నెల రోజులుగా ఈ స్టేషన్‌కు సీఐ పోస్టు ఊగిసలాటలో కొనసాగింది. ఇక్కడ సీఐగా పనిచేసిన జి.గోవిందరావును సిటీ వీఆర్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో ఏఎస్ఆర్ జిల్లా నుంచి హెచ్.మల్లేశ్వరరావును ఇక్కడికి గత నెలలో బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇంతవరకు ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టక పోవడం, కొద్ది రోజుల తర్వాత తిరిగి గోవిందరావు సీఐగా విధులు నిర్వహించడంపై కొత్త సీఐ వస్తారా లేదో అనే సందేహాలు స్థానికుల్లో నెలకొన్నాయి. బుధవారం రాత్రి కొత్త సీఐ మల్లేశ్వరరావు ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. పాత సీఐ గోవిందరావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇక్కడ సిబ్బంది గోవిందరావును సత్కరించారు. దీంతో ఆరిలోవ పీఎస్‌కు సీఐ సమస్య తీరినట్లయింది.

ఏయూ విభాగాల్లో రెక్టార్ ఆకస్మిక తనిఖీలు



విభాగంలో పరిశీలిస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు గురువారం పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం, ఎకనామిక్స్, తెలుగు, సైకాలజీ, హిందీ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో సిబ్బంది హాజరు పట్టికలు, బోధనా విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ఆరోగ్యకర వాతావరణంలో బోధించాలని సూచించారు.

మూగజీవికి ఎంత కష్టం..!



కారు ఢీకొని గాయపడిన గేదె

ఏయూక్యాంపస్: మూగ జీవికి పెద్ద కష్టం వచ్చింది. బీచ్ రోడ్డులో పోలీస్ మెస్ ఎదురుగా బుధవారం అర్ధరాత్రి సమయంలో వేగంగా వస్తున్న కారు ఒక గేదెను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన గేదె కదలలేక విలవిల్లాడింది. స్థానికులు గాయపడిన మూగజీవాన్ని అతి కష్టం మీద ఫుట్‌పాత్‌పైకి చేర్చారు. కాళ్లు విరిగి పోవడంతో కదలలేని స్థితిలో ఉన్న మూగజీవం రాత్రంతా ఫుట్‌పాత్‌పై నరకయాతన పడింది. జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్కడికి చేరుకుని గురువారం ఉదయం మూగజీవాన్ని మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు.

పిడుగు పడి.. పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఆరిలోవ: ఆరిలోవ హెల్త్‌సిటీ ప్రాంతం క్యూ–1 ఆస్పత్రి సమీపంలో గురువారం సాయంత్రం పిడుగు పడింది. వర్షం కురుస్తుండగా పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారంతా భయభ్రాంతులకు గురయ్యారు. కొంత సేపటికి దగ్గరలోనే పిడుగు పడి ఉంటుందని, ఎవరికి ఏం జరిగిందో అంటూ స్థానికులు పరుగులు తీశారు. హెల్త్‌సిటీ అంతా తిరిగారు. ఆఖరికి క్యూ–1 ఆస్పత్రి ముందున్న విద్యుత్ స్తంభంపై పిడుగు పడినట్లు గుర్తించారు. ఆ సమయంలో సమీపంలో ఎవరు రోడ్డుపై లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా.. క్యూ–1 హాస్పిటల్ ముందే పిడుగు పడటంతో ఆస్పత్రిలో జనరేటర్ పాడైపోయింది. పిడుగు ప్రభావానికి హెల్త్‌సిటీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయి గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ఆస్పత్రుల్లో రోగులు ఇబ్బంది పడ్డారు.



ఆర్కే బీచ్ వద్ద దుకాణాల్లోకి వస్తున్న సముద్రపు నీరు



విక్టరీ ఎట్ సీ వద్ద చెరువును తలపిస్తున్న రహదారి



పోలీస్ మెస్ వద్ద రోడ్డుపై ఇసుక మేటలు

తీరం.. అల్లకల్లోలం

- వాయుగుండం ప్రభావంతో భారీ వర్షం
- ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలు



వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న ఆటో



ఆర్కే బీచ్ తీరంలో విద్యుత్ స్తంభాలను తాకుతున్న కెరటాలు

ఏయూక్యాంపస్: వాయుగుండం ప్రభావంతో విశాఖ సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షం ప్రజలకు అవస్థలను తెచ్చింది. తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. రాత్రి వేళలో వీటి తీవ్రత మరింత అధికంగా ఉంటోంది.

పొంగి పొర్లుతున్న కాలువలు

వర్షం ప్రభావంతో బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో కాలువలు పొంగి పొర్లుతున్నాయి. వాటిలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్డు పైకి చేరుతోంది. వర్షపు నీరు భారీగా కాలువల నుంచి ప్రవహిస్తోంది. యూజీడీ మ్యాన్‌హోళ్ల నుంచి భారీగా మురుగు నీరు రహదారుల పైకి చేరుతోంది.

చెరువును తలపిస్తున్న రోడ్లు

బీచ్ రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వెనుక భాగంలో వైఎంసీఏ నుంచి అంబికా సీ గ్రీన్ హోటల్‌కు వెళ్లే రహదారి వర్షం కురిస్తే చిన్నపాటి చెరువుగా మారిపోతోంది. దీనికి ప్రధాన కారణం ఈ మార్గాన్ని ఆనుకుని ఉన్న పెద్ద మురుగు కాలువ నిండిపోవడమే. వర్షం కురిసిన సందర్భంలో భారీగా వ్యర్థాలు, ప్లాస్టిక్ సీసాలు అడ్డుపడి కాలువ బ్లాక్ అవుతోంది. దీనితో మురుగు నీరు, వర్షపు నీరు కలిసి రోడ్డును నింపేస్తున్నాయి. విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న ప్రాంతం రోడ్డుకంటే తక్కువ ఎత్తులో ఉండటంతో ఇక్కడ కూడా నీరు నిలిచి పోతోంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది వెంటనే ఇక్కడి వ్యర్థాలను తొలగించి, నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ వర్షం కారణంగా ఇసుక కొట్టుకు వచ్చి తీరంలో రోడ్డుపై మేట వేస్తోంది. వీటిని జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగిస్తున్నారు.

దుకాణాల్లోకి సముద్రపు నీరు

ఆర్కే బీచ్ వద్ద సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన పలు దుకాణాల్లోకి సముద్రపు నీరు చేరుతోంది. వాయుగుండం ప్రభావంతో భారీ కెరటాలు వస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో కెరటాల తీవ్రత మరింత అధికంగా ఉంటోంది. బస్టాప్‌ను తాకే విధంగా రాత్రి సమయంలో కెరటాలు వస్తున్నాయి. దీంతో తీరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

- జోరువాన.. జనం హైరానా
- కేఆర్ఎం కాలనీ, ఇసుకతోటల్లో చెరువులను తలపిస్తున్న రహదారులు
- వీధి కాలువల్లో పూడికలు తొలగించని పారిశుధ్య కార్మికులు



ఇసుకతోట కృష్ణుడి గుడి రహదారిలో వర్షపు నీరు



జలమయమైన రహదారి

మద్దిలపాలెం: వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కేఆర్ఎం కాలనీ, ఇసుకతోట కాలనీల్లోని రహదారులు వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. చినుక పడితే చాలు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యమే దీనికి కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వీధి కాలువల్లోని పూడికలు తొలగించక పోడంతో వాన నీరు పోయే వీలు లేక ఇళ్లోకి మురుగు వస్తోందంటూ మండిపడుతున్నారు.

రహదారులు జలమయం

ఇసుకతోటలోని అంబేడ్కర్ కాలనీ, కృష్ణుడి గుడి, జేఆర్ నగర్ కాలనీలు నీట మునిగాయి. ఇక్కడి రహదారులన్నీ వర్షపు నీటితో నిండిన తర్వాత పారిశుధ్య సిబ్బంది వచ్చి కాలువల్లో పూడికలు తీయడం ప్రారంభించారు. 16వ వార్డు కేఆర్ఎం కాలనీ గురువారం కురిసిన భారీ వర్షానికి నిండా మునిగింది. రహదారులు జలమయం కావడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. కేఆర్ఎం కాలనీ నుంచి ఇసుకతోట, రజక వీధి మీదుగా ప్రవహించే గెడ్డలో నీటి ఉధృతి పెరిగింది.

కొండవాలులో వణుకు

జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీతోపాటు సింహాద్రిపురం, దుర్గానగర్, కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వర్షాలకు వణకుతున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

తడిసి ముద్దయిన మద్దిలపాలెం

జోరువానతో మద్దిలపాలెం తడిసి ముద్దయింది. 23వ వార్డు మద్దిలపాలెంలో కాలువలు పొంగి పొర్లుతున్నాయి. వ్యర్థాలు రోడ్లపైకి చేరాయి. దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు.

పొంగిపొర్లిన మ్యాన్‌హోళ్లు

భారీ వర్షానికి ఇక్కడి యూజీడీ మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లాయి. రోడ్లు జలమయంగా మారడంతో వాహన చోదకులు ఇక్కట్లు గురయ్యారు. శివాజీ పాలెం ప్రధాన రహదారిపై మ్యాన్‌హోళ్లు పొంగాయి. మ్యాన్‌హోళ్ల వద్ద ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ రమేష్



సంతపాలెం పాఠశాలలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విశాఖ సిటీ: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఇతర విభాగాధిపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఎవరైనా రుషులవుతారని అనడానికి వాల్మీకి జీవితం నిదర్శనని పేర్కొన్నారు. ఒక బోయి.. మహర్షిగా మారి యావత్ ప్రపంచం కీర్తించే రామాయణ మహా కావ్యం రచించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో వాల్మీకి జయంతి ఘనంగా జరిపారు. మహర్షి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాలుకులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సిరికి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాల్మీకి గురించి పిల్లలకు వివరించారు. ఇతిహాసాల్లో ఆయన రాసిన రామాయణం తొలి గ్రంథమన్నారు. దీనిలో సీతారాముల జీవిత కథను గురించి తెలియజేశారని చెప్పారు. అటువంటి గొప్ప వ్యక్తి గురించి మనం తెలుసుకోవాలని, అందుకే వాల్మీకి జయంతిని జరుపుతున్నట్లు పేర్కొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

వాల్మీకి అడుగు జాడల్లో నడవాలి

మహారాణిపేట: రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) పి.నారాయణమూర్తి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాయణం కేవలం ఒక కథ మాత్రమే కాదని, మన జీవితాలకు దిక్సూచి అని కొనియాడారు. పంచాయితీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు మాట్లాడుతూ ఆధునిక యుగంలో మనం మన సంస్కృతి, విలువలను ఆదర్శాలను మర్చిపోతున్నామన్నారు. వాల్మీకి మహర్షి చూపించిన మార్గంలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు.

పోషకాహారంతో ఫిట్‌నెస్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని సమత డిగ్రీ కళాశాలలో ఫిట్ ఇండియా రన్ కార్యక్రమంలో భాగంగా గురువారం 'ఫిట్‌నెస్‌పై పోషకాహారం ప్రభావం' అనే అంశంపై అవగాహన కల్పించారు. సమత కళాశాల, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ వర్సిటీలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథి ఎస్‌వీఎన్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఫిట్‌నెస్ కోసం యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మనిషి ఆరోగ్యానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమన్నారు. శరీరానికి అవసరమైన మేర ప్రోటీన్స్, విటమిన్స్ రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించాలని ఫిర్యాదు

ఆరిలోవ: రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించాలని ఆరిలోవ పోలీసులకు ఓ వ్యక్తి గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామ్‌నగర్‌కు చెందిన చరణ్ సాయి వంశీ గీతం కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈ నెల 7న ఆ విద్యార్థి కాలేజీ నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా.. జోడుగుళ్లపాలెం స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ స్పీడ్ తగ్గించాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని ఓ కారు విద్యార్థి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తల, చేతులు, కాళ్లకు గాయాలైన వంశీని స్థానికులు గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆ విద్యార్థి కోలుకొని డిశ్చార్జి అయ్యాడు. ఈ ఘటనపై విద్యార్థి తండ్రి ఉదయ్‌శంకర్ గురువారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ద్వారా వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షానికి కూలిన రక్షణ గోడ



బాలుర వసతి గృహం రక్షణ గోడను పరిశీలిస్తున్న జోన్–2 అధికారులు

ఆరిలోవ: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గురువారం ఉదయం చినగదిలి దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం రక్షణ గోడ కూలిపోయింది. ఈ ఘటనపై జీవీఎంసీ అధికారులకు హాస్టల్ అధికారులు ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ జోన్–2 కమిషనర్ సింహాచలం, ఏసీపీ, సిబ్బంది వసతి గృహం వద్దకు చేరుకొని కూలిన గోడను పరిశీలించారు. మళ్లీ ఈ గోడను నిర్మించేలా జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని గృహం అధికారులకు తెలియజేశారు. ఇదిలా ఉండగా ఆరేళ్ల కిందటే నిర్మించిన ఈ రక్షణ గోడ హఠాత్తుగా కూలిపోవడం విశేషం. గోడ నిర్మాణంలో నాణ్యత లోపం వల్లే ఆరేళ్లకే కూలిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

'గద్దర్ అన్న యాదిలో..' సభను జయప్రదం చేయండి



గద్దర్ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాది శ్రీనివాస్, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ



సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేత ప్రసాద్ తదితరులు

మద్దిలపాలెం: ఈ నెల 20న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న గద్దర్ సభను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని హైకోర్టు న్యాయవాది వజ్జపర్తి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీతో కలిసి గద్దర్ అన్న యాదిలో.. సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ తన జీవితాంతం పాట కోసమే బతికాడని, అటువంటి మహనీయుడిని మనమంతా స్మరించుకోవాలన్నారు. మజ్జి దేవిశ్రీ మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు సభ జరుగుతుందని, గద్దర్ కుమార్తె వెన్నెల హాజరవుతున్నారని తెలిపారు. నగరంలోని అన్ని కళా సంస్థలు, ఉద్యమ సంస్థలు, మేధావులు, విద్యార్థులు, మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. న్యాయవాది వెంకట్ పాల్గొన్నారు.

గద్దర్ సభ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ సిటీ: గరీబోళ్ల కన్నీటి వెతలను కళ్లకు కట్టినట్లు తన పాటలతో చూపించిన గొప్ప ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ అని గిరిజన సంఘం నేత ప్రసాద్ పేర్కొన్నారు. ఏయూ రంజని గెస్ట్ హౌస్‌లో గద్దర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న జరగనున్న గద్దర్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం నాయకుడు అప్పలరాజు, పాటల తూట ఉదయ భాస్కర్, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ, పర్యావరణ కళామండలి జిల్లా కార్యదర్శి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో దిక్కున.. ఒక్కో రీతిన...



వైఎంసీఏ వద్ద నుంచి నిర్మలంగా కనిపిస్తున్న ఆకాశం



ఆర్‌కే బీచ్ వైపు నల్లని మబ్బులతో ఆకాశం

ఏయూక్యాంపస్: ఆకాశంలో మబ్బులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రీతిగా దర్శనమిస్తున్నాయి. గురువారం ఉదయం వైఎంసీఏ ఎదురుగా తెల్లని మబ్బులతో ఆకాశం నిర్మలంగా దర్శనమిచ్చింది. కొద్ది దూరంలో ఆర్.కె బీచ్ వైపు చూస్తే నల్లని మబ్బులతో ఆకాశం మేఘావృతమై కనిపించింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైనాపిల్ కాలనీ, సీఐడీ కార్యాలయం, కామాక్షినగర్, జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్, పాండురంగాపురం, శివాజీనగర్, ప్రగతినగర్, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకాంత్‌నగర్, కనకమహాలక్ష్మినగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌నగర్, ఆరిలోవ పోలీస్ స్టేషన్ ప్రాంతం, దుర్గానగర్, నెహ్రూనగర్, టి.ఐ.సి.పాయింట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి



దీన్‌దయాల్‌పురం పాఠశాల హెచ్‌ఎంతో మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

ఆరిలోవ: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ సూచించారు. జీవీఎంసీ 13వ వార్డు దీన్‌దయాల్‌పురం, పైనాపిల్ కాలనీల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. తరగతి గదుల్లో బోధనేతర వస్తువులు ఉండటం, గోడలు నానిపోయి, నాచు పట్టి అపరిశుభ్రంగా ఉండటాన్ని వెంకట శేషమ్మ గమనించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె మాట్లాడి తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమై వాతావరణ కల్పించాలన్నారు. విద్యార్థులకు మంచి భోజనం, వడకట్టిన తాగునీరు సరఫరాపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఎంఈవో పి.అనురాధ పాల్గొన్నారు.

యువతతోనే మత్తు పదార్థాల కట్టడి



మాట్లాడుతున్న జిల్లా యువ అధికారి ఉమా మహేశ్వరరావు

బీచ్‌రోడ్డు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లా యువ అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బీచ్ రోడ్డు యూత్ హాస్టల్‌లో మత్తు పదార్థాల వ్యసనం, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెడదారులు పట్టి, సాంఘిక దురాచారాలతో, నేర ప్రవృత్తి కలిగి ఉంటోందన్నారు. దీనిని కట్టడి చేయడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల యువత మత్తు పదార్థాలు సేవించి వివిధ నేరాల్లో పాల్గొంటున్నట్లుగా కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ విధమైన నేరాలను అరికట్టడంలో యువత ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమిధ–ఐ.డి.యు. ప్రాజెక్ట్ వి.రవికుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.రవికుమార్, వలంటీర్ హెల్త్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధి కె.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి ఎల్వీపీ కంటి వైద్య సేవలు



ఇంటి వద్దకు బైక్‌పై వెళ్తున్న సిబ్బంది

ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య విజ్ఞాన సంస్థ, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ భాగస్వామ్యంతో ఇంటి వద్దకు కంటి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ సేవలు విస్తృతంగా అందిస్తున్నట్లు ఆస్పత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ అనిత గురువారం తెలిపారు. ఈ సేవలు రాష్ట్రమంతటా అందుబాటులో ఉన్నాయన్నారు. గురువారం నుంచి మరింత విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన వారికి కంటి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వృద్ధులకు, చలన సంబంధిత సమస్యలు ఉన్నవారికి నాణ్యమైన కంటి ఆరోగ్య సంరక్షణ వృద్ధి చేయడానికి 'సీయింగ్ సీజ్ బిలీవింగ్' అనే పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్వీపీ కంటి వైద్య సేవలు అవసరమైన వారు 63024 32118 నంబర్‌కు ఫోన్ చేసి చిరునామా చెప్పాలన్నారు. ద్విచక్ర వాహనంపై విజన్ టెక్నీషియన్ ఇంటికి వచ్చి కంటి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.